

టీ కన్సల్ట్‌తో ఒప్పందం చేసుకున్న కంపెనీ ప్రతినిధి బు అబ్దుల్లా.

## నగరంలో బూ అబ్దుల్లా కంపెనీ పెట్టుబడులు

సిటీబ్యూరో, జూలై 16(నమస్తే తెలంగాణ): పెట్టుబడులకు అనుకూలంగా ఉన్న హైదరాబాద్ మహానగరంలో దుబాయ్ కంపెనీ బు అబ్దులా పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టేందుకు అంగీకారం తెలిపింది. ఈ మేరకు మంగళవారం టీ హబ్‌లో టీ కన్సల్ట్ సంస్థతో బు అబ్దుల్లా కంపెనీ ప్రతినిధి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఇటీవలే దుబాయ్‌లోని బూర్జ్ ఖలీఫాలో బూ అబ్దుల్లాతో టీ కన్సల్ట్ చైర్మన్ సందీప్ కుమార్ మక్తల సమావేశమయ్యారు. టీ కన్సల్ట్‌తో కలిసి పనిచేసేందుకు అంగీకరించిన ఆయన వెంటనే హైదరాబాద్‌కు వచ్చిన పెట్టుబడులకు సంబంధించి ఒప్పందాన్ని చేసుకోవడం కీలక పరిణామమని, అంతర్జాతీయ పెట్టుబడిదారులతో అనుసంధానమయ్యే టీ కన్సల్ట్ వారధిగా నిలుస్తుందని సందీప్ మక్తల తెలిపారు.

## సేవలో యువత ముందుండాలి

సిటీబ్యూరో, జూలై 16(నమస్తే తెలంగాణ): సమాజ సేవలో యువత ముందుండాలని జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి అన్నారు. ముషీరాబాద్ సర్కిల్ జాంభవి నగర్‌లో ఆదివారం కురిసిన వర్షాలకు వరద నీటిలో కొట్టుకుపోతున్న కారులో ఉన్న వారిని రక్షించిన యువకులను జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ అభినందించి, శాలువాలు కప్పి సన్మానించారు. నీటిలో మునిగిపోతున్న కారులో వారిని ఏ విధంగా రక్షించారన్న విషయమై మేయర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులు ప్రణీత్ యాదవ్, మోహన్ యాదవ్, నాగరాజు చారి, ఎం.మార్టిన్‌లు ప్రమాద ఘటన చూడగానే అప్రమత్తమై చూపిన చొరవ ధైర్య సాహసాలను మేయర్ మెచ్చుకున్నారు. కార్యక్రమంలో శానిటేషన్ అడిషనల్ కమిషనర్ రవి కిరణ్ పాల్గొన్నారు.







ఎన్టీఆర్ స్టేడియం.. యువతకు ఓ అతి పెద్ద క్రీడా మైదానం. ఆట స్థలం విశాలంగా ఉందని స్థానికులు చెత్త, చెదారం వేసి, ఇష్టారాజ్యంగా వాడుతుండగా, ప్రభుత్వ, అధికార యంత్రాంగం సైతం పట్టించుకోలేదు. దీనిని గమనించిన 'నమస్తే తెలంగాణ' ఒక్క క్లిక్‌తో.. సమస్యకు పరిష్కారం చూపింది. కాగా, పిల్లలు ఆడుకునేందుకు మైదానం అనుకూలంగా మారింది. నాడు చెత్తా చెదారంతో ఉన్న ఆట స్థలం కాస్త.. నేడు పరిశుభ్ర వాతావరణాన్ని సంతరించుకుంది.

# ఆషాఢం.. ఆఫర్ల వర్షం!

**విభిన్న రకాల ఆఫర్లతో ఆకట్టుకుంటున్న షాపింగ్ మాల్స్, జువెల్లరీ దుకాణాలు**

- కస్టమర్లతో సందడి చేస్తున్న షాపింగ్ కేంద్రాలు
- పోటాపోటీగా ఆఫర్లు.. కేజీల లెక్కన దుస్తుల విక్రయం
- మేకింగ్ ఛార్జీలు లేకుండా బంగారం ఆఫర్లు



*ఆషాఢం వచ్చిందంటే ఆఫర్ల వర్షం కురుస్తుంది. విభిన్న రకాల రాయితీలతో అనేక ఆఫర్లు పుట్టుకొస్తాయి. మార్కెట్లో పోటాపోటీగా ప్రత్యేక ఆఫర్ అంటూ వ్యాపార దిగ్గజాలు ప్రకటనలు చేస్తాయి. ఏదైనా ఒక కొత్త వస్తువు కొనుగోలు చేయడం ఆషాఢం అనవాయితీగా ఉండటంతో వస్త్ర, జువెల్లరీ, ఎలక్ట్రికల్ ఇలా అన్ని రంగాల దుకాణాలు కస్టమర్లను ఆకట్టుకోవడానికి కొంగొత్త ఆఫర్లను ముస్తాబు చేస్తున్నాయి. ఇప్పుడు నగరంలో ఎక్కడ చూసినా ఆషాఢం ఆఫర్ అంటూ కస్టమర్లకు ఆహ్వానం పలుకుతున్నాయి. ప్రధానంగా ఆర్ఎస్ బ్రదర్స్, సౌత్ ఇండియా షాపింగ్, చందన బ్రదర్స్, సీఎంఆర్ తదితర వస్త్ర దుకాణాలతో పాటు కల్యాణ్, లలిత, సీఎంఆర్, సౌత్ ఇండియా తదితర జువెల్లరీ దుకాణాలు సైతం ఆషాఢం ఆఫర్లతో సందడి తలపిస్తున్నాయి. ఓ వస్త్ర దుకాణం కేజీల లెక్క దుస్తులను విక్రయిస్తుంటే.. మరో వస్త్ర దుకాణం 50 నుంచి 70 శాతం వరకు డిస్కౌంట్ అంటూ బోర్డులు పెడుతున్నాయి.*

*– సిటీబ్యూరో, జూలై 16 (నమస్తే తెలంగాణ)*

### వస్త్ర దుఖాణాలకు భలే క్రేజ్..!

ఆషాఢంలో ప్రధానంగా వస్త్ర దుకాణాల పంట పడుతుంది. కేజీ చొప్పున చీరలను విక్రయిస్తున్నారు. కొన్ని షాపులు ఫ్యాన్సీ డ్రెస్సులపై 70 శాతం వరకు ఆఫర్లు ప్రకటిస్తున్నాయి. ఫ్యాంట్, షర్ట్స్‌లోనూ ఆషాఢం ఆఫర్లతో రూ.700 ఖరీదును 400కు విక్రయిస్తున్నారు. బ్రాండెడ్ వస్త్రాలు సైతం ఆషాఢం ఆఫర్లతో సగానికి సగం ధరల్లో లభిస్తున్నాయని ప్రకాశ్ అనే కస్టమర్ తెలిపాడు. దీంతో వస్త్ర దుకాణాలకు నిలయంగా ఉన్న సికింద్రాబాద్, అమీర్‌పేట్, అబిడ్స్, దిల్‌షుక్ నగర్, కూకట్‌పల్లి ప్రాంతాలు కస్టమర్లతో కళకళలాడుతున్నాయి. ఈ ఆషాఢం ఆఫర్లు కేవలం కొద్ది రోజులు మాత్రమే ఉండటంతో కస్టమర్లు షాపింగ్ చేయడానికి అమిత ఆసక్తి కనబరుస్తున్నారు. ఆషాఢం ఆఫర్లతో కొనుగోలు చేసిన వస్తువులతో ఇల్లు కొత్త అనుభూతిని పంచనుంది.

### జువెల్లరీలోనూ ఆఫర్లు..!

అలంకరణ అనేది ఇప్పుడు ఒక పెద్ద బిజినెస్‌గా మారింది. అందులో బంగారు ఆభరణాలది ప్రత్యేక స్థానం. సీజన్‌తో సంబంధం లేకుండా మగువల మనుసును దోచే ఆభరణాలు అనేకం. చెవి పోగుల నుంచి వడ్డాణం వరకు ప్రతీది ఓ ప్రత్యేకత. ట్రెండ్‌కు తగ్గ జువెల్లరీని పరిచయం చేయడానికి నగరంలో సరికొత్త జువెల్లరీ దుఖాణలు తమ బ్రాంచీలను విస్తృతం చేస్తున్నాయి. ముఖ ఆకారాన్ని ఆధారం చేసుకుని.. వయస్సును దృష్టిలో ఉంచుకుని..వర్కింగ్‌ను బట్టీ, డ్రెస్సును ఆధారంగా చేసుకుని.. ఇలా విభిన్న రకాలుగా జ్యువెల్లరీని మార్కెట్‌లోకి తీసుకొస్తున్నారు. అందుకు తగ్గట్టు జువెల్లరీ ట్రెండ్‌ను మగువలు ఫాలో అవుతున్నారు. ఇందులోనూ ఆషాఢం ఆఫర్ల పేరుతో కస్టమర్లను ఆకట్టుకోవడానికి జువెల్లరీ నిర్వాహకులు రెడీ అయ్యారు. ఇంకోవైపు ఎలాంటి మేకింగ్ ఛార్జీలు లేకుండా బంగారు ఆభరణాలపై అదిరిపోయే ఆఫర్లు ఇస్తున్నారు. సోమాజిగూడలోని ముకుంద జువెల్లరీ వాళ్లు ఆషాఢం బంపర్ సేల్‌లో భాగంగా వీఏ మీద 20 శాతం ప్రత్యేక డిస్కౌంట్ ఇస్తున్నారు. డైరెక్ట్ ఫ్యాక్టరీలే అవుట్ లెట్ కావడంతో ఇలాంటి ఆఫర్ ఇవ్వడం సాధ్యపడుతుందని నిర్వాహకులు తెలిపారు. ఎలక్ట్రికల్ వస్తువులు ఫ్రిజ్‌లు, వాషింగ్ మిషన్లు, ల్యాప్‌టాప్‌లు తదితర వాటిపై కూడా ఆషాఢం ఆఫర్లు విరివిగా వస్తున్నాయి. మరోవైపు ఆన్‌లైన్‌లోనూ ఆషాఢం ఆఫర్లు ప్రకటిస్తుండటంతో కస్టమర్లు ఆర్డర్ పెట్టడంలో బిజీగా మారుతున్నారు. ప్రస్తుతం మహిళలు తక్కువ ధరలో అందమైన డిజైన్లను వెతుకుతున్నారు. ఇందుకు ఆషాఢం వేదికగా చేసుకుంటున్నారు. అవి అన్ని అవసరాలకు తగ్గట్టుగా ఉండాలని భావిస్తున్నారు. బ్రైడల్ జువెలరీలో మహిళలు అన్ని రకాల ఆభరణాలు అంటే పాపిడి బిళ్ల, ముక్కుపోగు, జూకాలు, నెక్లెస్, మీడియం నెక్లెస్, చెవిజూకాలు, చెవిపోగులు, దండె కడియాలు, చేతి వంకీలు, వడ్డాణం, గజ్జెలు, మెట్లెలు లాంటి వాటిపై మనసు పారేసుకుంటున్నారు.

### పెరిగిన కొనుగోలు శక్తి..!

సాధారణంగా నగరంలో షాపింగ్ మాల్స్ ఏ రోజైనా సందడిని తలపిస్తాయి. నగరవాసుల కొనుగోలు శక్తి పెరగడంతో వారు షాపింగ్, వినోదంపై అత్యధికంగా ఆసక్తి చూపిస్తున్నారు. వీరి ఆసక్తులను దృష్టిలో పెట్టుకుని జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్స్ తమ కార్యాలయాలను నగరంలో ఏర్పాటు చేస్తున్నాయి. ఇప్పటికే ఉన్న షాపింగ్ మాల్స్‌కు దీటుగా ఒకే చోట వినోదం, షాపింగ్ ఉండేలా మాల్స్ వెలుస్తున్నాయి. కుటుంబ సమేతంగా అవసరమయ్యేవన్నీ అందుబాటులో ఉంచుతున్నాయి. చుట్టపక్కల రియల్ ఎస్టేట్ మార్కెట్‌ను ఇవి అంతగా ప్రభావితం చేస్తున్నాయి. అందుకే, మాల్స్ నిర్మాణంలో హైదరాబాద్ దూసుకుపోతుంది. ఐటీ కారిడార్‌లోనే ఇవి అత్యధికంగా వస్తున్నాయి. రిటైల్ స్పేస్‌లో వ్యవస్థీకృత మార్కెట్ వేగంగా విస్తరిస్తోంది. బ్రాండెండ్ దుకాణాల రాకతో వీటికి డిమాండ్ పెరిగిందని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. వినోదం, షాపింగ్, ఆహారం వరకు అన్నీ ఒకే చోట సౌకర్యంగా ఉండటంతో సందర్శకులు ఉదయం నుంచి రాత్రి వరకు మాల్స్‌లోనే గడుపుతున్నారు. ఆదాయాలు పెరగడం, జీవన శైలిలో వచ్చిన మార్పులు కూడా వీటికి బాగా కలిసోస్తుంది. బేగంపేట, పంజాగుట్ట, బంజారాహిల్స్, ఐటీ కారిడార్, దిల్‌సుఖ్‌నగర్ పరిమితమైన మాల్స్ సంస్కృతి నగరంలోని శివార్లకు పాకింది. గచ్చిబౌలిలో అతి పెద్ద మాల్ శరత్ సిటీ మాల్, మాదాపూర్ తదితర ప్రాంతాల్లో కొత్త మాల్స్ అందుబాటులోకి వచ్చాయి. అత్తాపూర్‌లో కూడా వచ్చింది. వీటి రాకతో ఆ ప్రాంత రూపురేఖలు మాల్స్‌తో కళకళలాడుతున్నాయి. ఫలితంగా హైదరాబాద్ షాపింగ్ దుకాణాలు తమ బ్రాండ్లను నగరవాసులకు పరిచయం చేయడంలో పోటీపడుతున్నాయి.

## డ్యామిట్ కథ అడ్డం తిరిగింది...!

- రూ.వంద కోట్ల విలువచేసే భూమి కబ్జాకు యత్నం
- స్థానికుల బెదిరింపులతో పరార్
- దిక్కుతోచక రంగంలోకి దిగిన రెవెన్యూ యంత్రాంగం

మణికొండ, జూలై 16: అది కోట్ల విలువ చేసే సర్కారు భూమి. పాత రికార్డులను తీసుకువచ్చి ప్రభుత్వంలోని కొంతమంది పెద్దల సహకారంతో ఆ భూమిని కబ్జా చేయాలని పక్కా పథకం వేశారు. కానీ, కథం అడ్డం తిరుగడంతో అంతా పరారయ్యారు. పూర్తి వివరాలల్లోకి వెళితే, గండిపేట రెవెన్యూ మండల పరిధిలోని పుప్పాలగూడ గ్రామ సర్వే నం. 324లోని దాదాపు పదెకరాల కాందిశీకుల భూమిని కబ్జా చేయాలని కొత్తగా సర్కారు ఏర్పాటైనప్పటి నుంచి కొంత మంది వ్యక్తులు అక్కడ కాచుకుని కూర్చుకున్నారు. ఇటీవల రెండు రియల్ ఎస్టేట్ గ్రూపులు ప్రయత్నాలు చేస్తూ ఓ వర్గం సర్కారులోని ఓ పెద్ద మనిషిని పట్టుకుని స్థానిక రెవెన్యూ అధికారులకు చెప్పించి దర్జాగా రెండు కంటైనర్లను ఏర్పాటు చేశారు. మరో గ్రూపు విషయాన్ని తెలుసుకుని అక్కడకు చేరుకుని బౌన్సర్లతో రంగంలోకి దిగి హడావిడి చేసింది. దీంతో స్థానిక ప్రజలు పరిస్థితిని గమనించి రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. కానీ, వారికి ముందు విషయం తెలుసు కాబట్టి పెద్దగా స్పందించలేదనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. దాదాపు రూ.వందకోట్ల విలువ చేసే ఆ భూమిని ఎట్లాగైనా రెవెన్యూ అధికారులను మేనేజ్ చేసి ఆక్రమించాలని యత్నించారు. చివరకు రెండు గ్రూపుల మధ్య చోటు చేసుకున్న వివాదం చినికి చినికి గాలివానలా మారడంతో దిక్కుతోచక రెవెన్యూ అధికారులు అక్కడకు చేరుకుని ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన కంటైనర్లను తొలగించారు. ఈ వ్యవహారంలో కోట్లాది రూపాయాలు చేతులు మారినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. గతంలో బీఆర్ఎస్ సర్కారు హయాంలో పుప్పాలగూడలోని 198 ఎకరాల ప్రభుత్వ భూమిని అప్పటి సీఎం కేసీఆర్ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి కాందిశీకుల భూములను ప్రభుత్వానికి దక్కేలా పోరాడి న్యాయస్థానంలో గెలిచిన విషయం తెలిసిందే. అయినా, కబ్జాదారులు తిరిగి ఆ విలువైన భూములను తమ వశం చేసుకునేందుకు యత్నిస్తుండటంపై సర్వత్రా విమర్శలు తలెత్తుతున్నాయి.

## మొక్కలే.. జీవకోటికి ప్రాణాధారం

**సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నగర శాఖ హెడ్ ధారాసింగ్ నాయక్**

**కేబీఆర్ నేషనల్ పార్కులో సెంట్రల్ బ్యాంక్ హరితధార కార్యక్రమం ప్రారంభం**



మొక్కలు నాటిన సెంట్రల్ బ్యాంక్ నగర శాఖాధిపతి కె.ధారాసింగ్ నాయక్, తదితరులు

జూబ్లీహిల్స్, జూలై 16: మొక్కలే జీవకోటికి ప్రాణాధారమని, పచ్చదనం లేకుండా ప్రపంచ మనుగడ కష్టమని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నగర శాఖ హెడ్ కె.ధారాసింగ్ నాయక్ పేర్కొన్నారు. జూబ్లీహిల్స్‌లోని కేబీఆర్ నేషనల్ పార్కులో మంగళవారం బ్యాంక్ అధికారులతో కలిసి హరితధార కార్యక్రమాన్ని ప్రారంభించారు. పీఎం నరేంద్ర మోడీ పిలుపు మేరకు మార్చి 2025 వరకు 140 కోట్ల మొక్కలు నాటాలన్న సంకల్పంతో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ జోన్ ఆధ్వర్యంలో దేశంలోని ప్రతి బ్రాంచ్‌లో విధిగా ఐదు మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా తెలంగాణ, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో నిర్దేశిత లక్ష్యాన్ని చేరేలా మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌లు సి.సత్యవాణి, గుల్షన్ కుమార్, చీఫ్ మేనేజర్ యు.యతీంద్ర తదితరులు పాలొని మొక్కలు నాటారు. నగర శాఖ ఆధ్వర్యంలో కేబీఆర్ పార్కులో 100 మొక్కలు నాటి పరిరక్షించేందుకు ప్రోత్సహించిన డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ ఆఫీసర్ జోజి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అనురాధలకు కృతజ్ఞతలు తెలిపారు.

### జీహెచ్ఎంసీలో వైభవంగా బోనాలు



బోనాల నేపథ్యంలో జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో కట్ట మైసమ్మ అమ్మవారి కళ్యాణ మహోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన బోనాల వేడుకల్లో మేయర్ విజయలక్ష్మి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

*– సిటీబ్యూరో, జూలై 16(నమస్తే తెలంగాణ)*

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- సమీక్షలో మేయర్ విజయలక్ష్మి

సిటీబ్యూరో, జూలై 16(నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ ప్రజలకు ఇబ్బందులు కలిగితే సహించబోమని, అధికారులు అప్రమత్తంగా పనిచేయాలని జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి అన్నారు. జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్‌లో మంగళవారం శేరి లింగంపల్లి జోన్ యూసుఫ్‌గూడ సర్కిల్ బోరబండ డివిజన్‌కు సంబంధించిన అభివృద్ధి పనులపై సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులు, ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్, వాటర్ వర్క్స్, ఎంటమాలజీ, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ అధికారులతో బోరబండ కార్పొరేటర్ మహమ్మద్ బాబా ఫసియుద్దీన్‌తో కలిసి మేయర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజా సమస్యలపై దృష్టి సారించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఎవరి పని వారు చేస్తూ సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. వర్షాకాలంలో ప్రాణ నష్టం జరగవద్దని, షార్ట్ సర్క్యూట్ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, అన్ని ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని మేయర్ చెప్పారు. డార్క్ ఏరియాలలో వీధి లైట్లు ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపాలని, అందుకు పోలీస్‌శాఖ సహకారంతో అనుమానిత ఏరియాలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. మంచినీటి కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలని, నీటిని వృథా చేయొద్దని మేయర్ చెప్పారు. చెరువులో గుర్రపు డెక్కను తొలగించాలని, వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, డీ-సిల్టింగ్ చేయడం రెగ్యులర్‌గా జరగాలన్నారు.

## ఇసుక క్వారీల్లో అక్రమాలను అరికట్టాలి

**లారీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మంచిరెడ్డి రాజేందర్‌రెడ్డి**



టీఎస్ఎండీసీ కార్పొరేషన్ చైర్మన్ అనిల్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న రాజేందర్‌రెడ్డి

మన్సూరాబాద్, జూలై 16: ఇసుక క్వారీలలో జరుగుతున్న అక్రమాలు, కాంట్రాక్టర్ల జరుపుతున్న దోపిడీలను అరికట్టాలని మంగళవారం తెలంగాణ స్టేట్ లారీ అసోసియేషన్ అధ్యక్షుడు మంచిరెడ్డి రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో టీఎస్ఎండీసీ కార్పొరేషన్ చైర్మన్ ఇరవత్రి అనిల్‌కు వినతి పత్రం సమర్పించారు. ఇసుక క్వారీల్లో లోడింగ్ పేరుతో నాలుగు వేలు, పట్టా పేరుతో వెయ్యి ఇంకా అనేక రకాలుగా రసీదు లేకుండా అనధికారికంగా ఏడు వేలు వసూలు చేస్తున్నారని చైర్మన్‌కు వివరించారు. లారీల్లో బలవంతంగా ఇసుక ఓవర్ లోడ్ వేస్తున్నారని, లారీలు రహదారుల మీదకు రాగానే పోలీసులు, మైనింగ్, రవాణా అధికారులు కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. కాంట్రాక్టర్లతో కుమ్మక్కై అక్రమాలకు పాల్పడుతున్న సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇసుక క్వారీల్లో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని టీఎస్ఎండీసీ కార్పొరేషన్ చైర్మన్ ఇరవత్రి అనిల్ హామీ ఇచ్చినట్లు మంచి రెడ్డి రాజేందర్‌రెడ్డి తెలిపారు. నర్రి వెంకన్న కురుమ, మాధవరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, లింగయ్య, అంజయ్య, నర్సింహా, అంజనేయులు, మహేందర్, బాలం రమేష్ పాల్గొన్నారు.



## అంగన్‌వాడీలలో మాతృత్వ మధురిమలు

**అమ్మమాట-అంగన్వాడి బాట షురూ..**

జూబ్లీహిల్స్, జూలై 16: అంగన్‌వాడీ టీచర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్ కింద రూ.2 లక్షలు, సహాయకులకు రూ.1 లక్ష ఇస్తామని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. అంగన్‌వాడి కేంద్రాలను నర్సరీ విద్య, ఆట వస్తువులు, ఆంగ్ల అక్షరాభ్యాసంతో ఆదర్శంగా తీర్చిదిద్దడంతో పాటు విద్యార్థులకు యూనిఫాం అందజేయనున్నట్లు తెలిపారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహ్మత్‌నగర్ డివిజన్ నేతాజీ సుభాష్ చంద్రబోస్ నగర్‌లోని అంగన్‌వాడి కేంద్రంలో 'అమ్మమాట.. అంగన్‌వాడి బాట' కార్యక్రమాన్ని కార్యదర్శి వాకాటి కరుణ ఐఏఎస్, ఐసీడీఎస్ డైరెక్టర్ కాంతి వెస్లీ, ఐఏఎస్‌లతో కలిసి మంత్రి మంగళవారం ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ, బిడ్డ పుట్టాక అమ్మ ఒడి నుంచి అంగన్‌వాడి కేంద్రానికి వస్తుందని, అంగన్‌వాడి కేంద్రాలలో చిన్నారుల ఆలనా పాలనతో పాటు మాతృత్వ మధురిమలు అందాలన్నారు. గతంలో ఆటలు పాటలకే పరిమితమైన అంగన్‌వాడి కేంద్రాలలో ప్రైవేట్ ప్లే స్కూళ్లకు దీటు గా ఇంగ్లిష్ బోధన అందిస్తామన్నారు.

## సుద్దాల హన్మంతు చరిత్రను యువత తెలుసుకోవాలి

**సీపీఐ మాజీ జాతీయ కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి**



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సురవరం సుధాకర్‌రెడ్డి , బీవీ రాఘవులు

చిక్కడపల్లి, జూలై 16: సుద్దాల హన్మంతు చరిత్రను ప్రతి యువకుడు తెలుసుకోవాలని సీపీఐ మాజీ జాతీయ కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి అన్నారు. వెట్టిచాకిరికి, భూ కేంద్రీకరణకు వ్యతిరేకంగా కొనసాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రజాకవి సుద్దాల మనుమంతు పెన్ను గన్ను పట్టి బ్రహ్మాండమైన మద్దతు ఇచ్చారని, ప్రజలను చైతన్య పరిచారని సీపీఐ మాజీ జాతీయ కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నవ తెలంగాణ పబ్లిషింగ్ హౌస్, ఎస్‌వీకే, ప్రజా నాట్యమండలి, టీపీఎస్‌కే, అరసం, తెలంగాణ సాహితీ, సుద్దాల ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 'ప్రజాకవి సుద్దాల హనుమంతు సమగ్ర సాహిత్య-జీవితం' పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సురవరం సుధాకర్‌రెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరించారు. తెలంగాణ సాయుధ పోరాటం మహోత్తరమైన పోరాటం. దీనిపై అనేక వివాదాలు సృష్టించారని, వక్రీకరించారని తెలిపారు. సుద్దాల హనుమంతు పాటలు మాత్రమే రాయలేదని, స్వయంగా పోరాటంలో పాల్గొన్నారని వివరించారు. ఎమ్మెల్యే కూనంనేని, సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, సుద్దాల అశోక్, సినీ నటుడు ఉత్తేజ్, అరుణోదయ విమలక్క పాల్గొన్నారు.

# ఐటీ చెంతకు.. ఆర్టీసీ

- కంపెనీలతో సంప్రదింపులకు ప్రత్యేక నోడల్ అధికారి
- ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్‌పై సమస్యలు
- సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్‌తో చర్చించిన ఆర్టీసీ ఎం.డి సజ్జనార్



సిటీబ్యూరో, జూలై 16(నమస్తే తెలంగాణ): ఐటీ ఉద్యోగులకు మెరుగైన మౌలిక వసతులను కల్పించేందుకు ఐటీ కంపెనీలు ఎప్పటికప్పుడు ప్రయత్నాలు చేస్తూనే ఉంటాయి. ఒక ఐటీ ఉద్యోగి ఇంటి నుంచి ఆఫీసు వచ్చే వరకు అవసరమైన ఏర్పాట్లను కల్పించేందుకు ప్రాధాన్యతనిస్తున్నాయి. ప్రస్తుతం, ఐటీ కారిడార్‌లో ప్రైవేటు వాహనాలకు తోడు ఐటీ కంపెనీలు హైర్ చేసుకున్న కార్లు అధికంగా ఉండటంతో నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా మారాయి. ఇదే విషయమై ఐటీ కంపెనీల ఫెసిలిటీ మేనేజర్లతో సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్‌తో చర్చించింది. హైదరాబాద్‌లో ఐటీ రంగం దినదినం అభివృద్ధి చెందుతుండటంతో లక్షలాది మంది ఉద్యోగ రిత్యా నగర నలుమూలల నుంచి ఐటీ కారిడార్‌లోని కంపెనీలకే వచ్చి పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో లక్షలాది వాహనాలు ఐటీ కారిడార్‌కు వచ్చి వెళ్తున్నాయి. కాగా, ఐటీ కారిడార్‌కు మెట్రో సౌకర్యం ఉండటంతో కొందరు ఐటీ ఉద్యోగులు మెట్రోలోనే రాకపోకలు సాగిస్తున్నారు. అయినా, ఐటీ కారిడార్లలో ఎక్కడ చూసినా వాహనాల రద్దీ గణనీయంగా ఉంటోంది. ఈ నేపథ్యంలోనే కార్లకు బదులుగా ఎక్కువ మంది ప్రయాణం చేసేందుకు వీలుండే బస్సులను ఐటీ కంపెనీల నుంచి నడపడం ద్వారా కొంత మేరకు ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గించేందుకు అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమైంది. ఇదే విషయాన్ని ఇటీవలే ఐటీ కంపెనీలకు సంబంధించిన కార్యక్రమంలో పాల్గొని ఆర్టీసీ ఎం.డి సజ్జనార్ దృష్టికి తీసుకువెళ్లారు. దానికి ఆయన సానుకూలంగా స్పందించారు.

### ఐటీ కంపెనీలతో చర్చించేందుకు ...

ఐటీ కంపెనీలకు ఆర్టీసీ బస్సులను అద్దెకు ఇవ్వడంపై ఆర్టీసీ సంస్థ పరంగా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తామని ఎం.డి సజ్జనార్ హామీ ఇచ్చారు. ఆర్టీసీ తరపున ఐటీ కంపెనీలతో చర్చించేందుకు ఒక నోడల్ అధికారిని నియమిస్తామని చెప్పారు. ఐటీ కంపెనీల ఫెసిలిటీ మేనేజర్లు తమకు ఎన్ని బస్సులు అవసరం ఉన్నది? ఏయే మార్గాల్లో నడపాలన్న విషయాలను నోడల్ అధికారులతో మాట్లాడి, ఆర్టీసీ బస్సులను హైర్ చేసుకోవచ్చని ఐటీ కంపెనీల ప్రతినిధులకు సూచించారు. ఐటీ కారిడార్‌లోని ప్రధాన ప్రాంతాలైన మాదాపూర్, రాయదుర్గం, కొండాపూర్, గచ్చిబౌలి, ఫైనాన్సియల్ డిస్ట్రిక్, నానక్‌రాంగూడ, పుప్పాల్‌గూడ, కోకాపేట ప్రాంతాల్లో సుమారు 1500లకు పైగా ఐటీ కంపెనీలు ఉండగా, అందులో 150 నుంచి 250 కంపెనీల్లో 10 వేల నుంచి మొదలు కొని 20 వేల మంది దాకా ఐటీ ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇప్పటి వరకు ఆయా కంపెనీలు తమ ఉద్యోగుల కోసం ప్రైవేట్ ట్రావెల్ ఏజెన్సీలతో కలిసి మినీ బస్సులు, 5,7 సీట్లర్ కార్లను అద్దెకు తీసుకుంటున్నాయి. వీటికి బదులుగా ఆర్టీసీ బస్సులను ఐటీ కంపెనీ ప్రాంగణాల నుంచి నడిపితే కార్ల సంఖ్య తగ్గడమే కాకుండా ట్రాఫిక్ సమస్యలు తగ్గుముఖం పట్టేందుకు అవకాశం ఉంటుందని ఓ ఐటీ కంపెనీ ఫెసిలిటీ మేనేజర్ తెలిపారు.

### ట్రాఫిక్ రద్దీ నియంత్రణపై సంయుక్త కార్యాచరణ

ఐటీ కారిడార్‌లో ఉద్యోగుల భద్రతతో పాటు ప్రశాంతమైన వాతావరణం కల్పించేందుకు పోలీసులు, ఐటీ కంపెనీలతో సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ పనిచేస్తోంది. ఇప్పటికే మహిళల కోసం ఉచితంగా షీ షెటిల్ పేరుతో ఐటీ కారిడార్‌లోనే తిరిగేలా ప్రైవేటు బస్సులను నడుపుతున్నారు. అయితే ఇవీ ఐటీ ఉద్యోగుల ప్రయాణ అవసరాలను పూర్తి స్థాయిలో తీర్చడం లేదు. లాస్ట్ మైల్ కనెక్టివిటీ కోసం ఆర్టీసీతో కలిసి సంయుక్త కార్యాచరణ రూపొందించడం ద్వారా నగర నలుమూలల నుంచి ఆర్టీసీ బస్సులను ఐటీ కారిడార్‌కు నడిపేలా చర్యలు తీసుకుంటామని ఐటీ కంపెనీ నిర్వాహకులు తెలిపారు. ఇప్పటికే సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ పోలీసులతో భద్రతా పరమైన అంశాలపై పనిచేస్తుండగా, ఇక నుంచి రవాణా వ్యవస్థలపైనా ప్రధానంగా దృష్టి సారిస్తామని, ఆర్టీసీతో కలిసి ప్రజా రవాణా వ్యవస్థ ఐటీ ఉద్యోగులకు అనుకూలంగా ఉండేలా చూస్తామని తెలిపారు.